క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



డోర్నకల్: యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి ఎంపీ మాలోత్ కవిత సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేశారు. డోర్నకల్‌కు చెందిన పున్నా రమారావు సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకోగా ఈ విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కల్లెపు సతీష్‌గౌడ్ ఎంపీ కవిత దృష్టికి తీసుకెళ్లగా ఎంపీ సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60వేలు మంజూరు చేయించి ఆదివారం చెక్కు అందించారు.

12న వాహనాల వేలం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ 38వాహనాలకు ఈనెల 12వ తేదీన బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ బి.కృష్ణ ఆదివారం తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్‌నాయక్ ఆదేశాల మేరకు జరిగే వేలంపాటలో పాల్గొని ప్రజలు వాహనాలను తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సమీపంలో బహిరంగ వేలంపాట జరుగుతుందని తెలిపారు. ఉదయం 10.30 గంటల వరకు వచ్చి నిబంధనల మేరకు వేలంపాటలో పాల్గొనాలని కోరారు. టీవీఎస్ వాహనాలు 10, బైక్ వాహనాలు 14, త్రిచక్ర వాహనాలు 11, నాలుగు చక్రాల వాహనాలు 3 ఉన్నాయని చెప్పారు.

గీతాముఖర్జీ సేవలు మరువలేనివి



నెహ్రూసెంటర్: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో సీపీఐ పార్టీగా 4సార్లు ఎమ్మెల్యేగా, 3సార్లు ఎంపీగా ఎన్నికైన గీతాముఖర్జీ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మీ అన్నారు. గీతముఖర్జీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఫాతిమా, పద్మ, లక్ష్మీ, వెంకటమ్మ, లక్ష్మీ, సంతోషీ, షాహిన్‌బాను తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పతనం తప్పదు

బయ్యారం: గత ఎన్నికల ముందు పలు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయని బీఆర్ఎస్ పార్టీకి పతనం తప్పదని బీజేపీ మండల అధ్యక్షుడు వీసం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని బండ్లకుంటలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం బూత్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీను, శంకర్, సాయి, ప్రవీణ్, సోమేష్, ప్రసాద్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

10 కేజీల బియ్యం అందించాలి

కేసముద్రం: ప్రభుత్వం పేదలకు రేషన్‌దుకాణాల ద్వారా ఒక్కొక్కరికి 10కేజీల చొప్పున బియ్యం అందించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక



రమేష్, అధ్యక్షుడు

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామంలో మాల వెల్ఫేర్ సొసైటీ గ్రామ అధ్యక్షుడిగా పురం రమేష్ ఎన్నికయ్యారు. ఆదివారం అమీనాపురంలో మాల వెల్ఫేర్ సొసైటీ 8వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షుడిగా కొడిరెక్క వెంకన్న, ప్రధాన కార్యదర్శి రుద్రపాటి వినోద్‌రాజ్, సహాయ కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి బొల్లెద్దు చందర్, సహాయ కార్యదర్శి దాసు, గౌరవ సలహాదారులు ఆనందరావు, యాకయ్య, విజయ్, సామేలు, ఆంథ్రయ్య ఎన్నికైనట్లు తెలిపారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

మరిపెడ: పత్తి రైతులకు గిట్టుబాటు ధరకల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరిపెడలో ఆయన మాట్లాడుతూ.. పత్తి రైతులు గిట్టుబాటు ధర లేక విలవిలలాడుతున్నారన్నారు. గత ఏడాదితో పోలిస్తే పత్తి ధర సగానికి పైగా పడిపోవడంతో పెట్టిన పెట్టుబడులు రాలేక ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారన్నారు. ఇంటి చుట్టు అప్పుల వాళ్లు తిరుగుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పత్తికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఆయనతోపాటు నాయకులు అబ్దుల్ రషీద్, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పదునెట్లా?

- సాధనకు స్థలం లేక క్రీడాకారుల ఇక్కట్లు
- మడికట్లు, ప్లాట్ల స్థలాలను ఆశ్రయిస్తున్న వైనం
- మరుగునపడుతున్న క్రీడాకారుల్లోని ప్రతిభ
- మరిపెడలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని డిమాండ్



మరిపెడ శివారులోని ప్లాట్ల స్థలంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

మరిపెడ రూరల్: క్రీడామైదానం లేక క్రీడాకారులు అవస్థలు పడుతున్నారు. మనలో ఉన్న ప్రతిభను చాటుకోవడానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయి. కానీ క్రీడాపోటీలు నిర్వహించుకోవాలన్న, ప్రాక్టీసు చేసుకుకోవలన్నా ప్రోత్సహించేవారు ఎంత ముఖ్యమో సాధన చేయడానికి ఆట స్థలం కూడా అంతకంటే ఎక్కువ ముఖ్యం. ఈ రెండింటిలో ఏది లోపించిన క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభ మరుగునపడే అవకాశం లేకపోలేదు. క్రీడలపై ఉన్న మక్కువతో మడికట్లు, రియల్ ఎస్టేట్ ప్లాట్లు, బీడుభూముల స్థలాలను ఆశ్రయించి ఆటలాడుతున్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని పాలకులు, అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడంమే తప్పా, క్రీడాకారులకు మాత్రం ఆట స్థలం కేటాయించడపై దృష్టి సారించకపోవడం క్రీడాభిమానులు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు.

మరుగున పడుతున్న ప్రతిభ

మరిపెడ మండలంలోని 44 గ్రామ పంచయతీలు కలిసి అతి పెద్ద మండలంగా అవతరించింది. మండల వ్యాప్తంగా వందల మంది క్రీడాకారులు కలిగి ఉన్నారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటెన్, వాలీబాల్, రన్నింగ్ తదితర క్రీడల్లో రాణిస్తున్న చాలా మంది ఆయా క్రీడల్లో ఎంతో ప్రావీణ్యత కలిగి ఉన్నారు. పలు క్రీడల్లో ప్రతిభ కలిగి రాష్ట్ర, జాతీయ, స్థాయిలో క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు మండల వ్యాప్తంగా కలిగి ఉన్నారు. కానీ ప్రాక్టీసు చేసుకోవడానికి గానీ, క్రీడా పోటీలు నిర్వహించుకోవడానికి గానీ మండల కేంద్రంలోని మినీ స్టేడియం లేకపోవడం కారణంగా వారు నిరుత్సాహానికి గురువుతున్నారు. కనీసం పలు క్రీడలను సాధన చేసుకునే అవకాశం లేక పోవడంపై ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి మరిపెడ మండల కేంద్రంలో క్రీడా మైదానం (మినీ స్టేడియం) ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి



ఆటస్థలం లేక పోవడంతో పలు క్రీడాకారులం ఇబ్బందులు పడుతున్నాం. చేసేది లేక ఊరు శివారు బీడు భూముల్లో ఒడిదొడుకుల మధ్య ఆటలాడుతున్నాం. ఇప్పటికైన మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో మినీస్టేడియం ఏర్పాటు చేసి ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించాలి.

– గుండగాని స్టాలిన్, క్రికెట్ క్రీడాకారుడు, మరిపెడ

ప్లాట్ల స్థలాలను ఆశ్రయిస్తున్నాం..



ఆటస్థలం లేక ఊరు శివారులోని మడికట్లు, ప్లాట్లకు కేటాయించిన స్థలాలను ఆశ్రయిస్తున్నాం. అక్కడి స్థలం ఒడిదొడుకులు ఉండటం కారణంగా క్రీడలు ఆడలేక పోతున్నాం. కిందపడిపోయి గాయాలపాలతున్నాం. స్థలం లేక క్రీడలు ఆడాలన్న క్రీడాకారుల్లోని ఆసక్తి సన్నగిల్లుతుంది.

– కొమ్ము భరత్, క్రీడాకారుడు, మరిపెడ

సైదులు జీవిత చరిత్ర డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, తదితరులు

మహబూబాబాద్ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆనాటి మానుకోట తాలూకాలోని విద్యార్థుల అభ్యుదయ వాదుల గుండెలలో నిలిచిన గుండెపాక సైదులు జీవిత చరిత్ర డైరీని ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా జీవితము ప్రారంభించిన తర్వాత తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించి వందలాదిమంది విద్యార్థులు జీవితాలను తీర్చిదిద్దిన ఘనత సైదులుదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు కుమారస్వామి, పత్రిక సంపాదకులు లక్ష్మి, నరసయ్య, సైదులు సతీమణి సుశీల, భిక్షపతి, ప్రభాకర్, సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ పార్నంది రామయ్య, శ్రీరాములు, పీరయ్య, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా గోదాదేవికి పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న భక్తులు

గార్ల: ధనుర్మాసోత్సవంను పురస్కరించుకొని గార్ల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం గోదాదేవి అమ్మవారికి 21 రకాల పూలతో కనుల పండుగగా శ్రీపుష్పయాగం కార్యక్రమం అర్చకులు ఆర్.రాము, వై.రామస్వామి నిర్వహించారు. గోదాదేవి జన్మ నక్షత్రమైన పుబ్బ నక్షత్రము సందర్భంగా అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు ధరించి, పంచామృతంతో అభిషేకించి, గోవిందనామ స్మరణలతో 108 కేజీల పూలతో వేదమంత్రోచ్చారణల నడుమ పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పుల్లఖండం రాంబాబు, రమేష్‌బాబు, వేణుగోపాల్ కవిత, వేమిశెట్టి శ్రీనివాస్ కవిత, పబ్బిశెట్టి రంగారావు తరంగిణి, అత్తులూరి సత్యం రమాదేవి, పుల్లఖండం కనకశేఖరం ప్రవీణ, పుల్లఖండం సతీష్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంధ్య, నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జనవరి 28, 29 తేదీలలో జరిగే పీఓడబ్ల్యూ రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో సంఘం మహాసభల కరపత్రాలను సంధ్య, టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజురోజుకు మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఈ మహాసభ స్ఫూర్తితో మహిళాలోకం హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఐలయ్య, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, ఐఎఫ్టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అనురాధ, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, పద్మ పాల్గొన్నారు.

సాంఘికశాస్త్రంపై పట్టు సాధించాలి

మహబూబాబాద్ రూరల్: విద్యార్థులు సాంఘిక శాస్త్రంపై పట్టు సాధించాలని ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ గ్రహీత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు చింతకుంట్ల కుమారస్వామి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆదివారం సాంఘిక శాస్త్రంపై విద్యార్థులకు విశ్లేషణ ద్వారా వివరించారు. పాఠశాల విద్యార్థులకు రాబోయే పదో తరగతి పరీక్షల్లో సాంఘిక శాస్త్రంలో ఎక్కువ మార్కులు సాధించడం కోసం పట నైపుణ్యంపై ప్రత్యేకంగా బోధన ఏర్పాటు చేశారన్నారు. హెచ్ఎం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు రామ్మూర్తి, హనుమంతు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

కేసముద్రం: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో కేపీఎల్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ముందుగా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు భుక్యా శోభన్‌బాబు అందజేసిన టీషర్టులను, ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నేతలు జాటోత్ హరీష్‌నాయక్, గణపారపు రమేష్, బిర్రు వెంకన్న, ధన్నసరి ఉపసర్పంచ్ బానోతు వెంకన్న చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. అనంతరం క్రీడాకారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించి, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అల్లం గణేష్, తోట అఖిల్ మాట్లాడుతూ.. ప్రథమబహుమతిగా రూ.30,116లను డాక్టర్ మురళీనాయక్ అందజేస్తారని, ద్వితీయ బహుమతిగా రూ.20,116 మాజీసర్పంచ్ డాక్టర్ అల్లంరమానాగేశ్వర్‌రావు అందజేయనున్నట్లు తెలిపారు.

ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని వదిలి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి బానోత్ లింగ్యా నాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని దామ్య తండా గ్రామ శివారులో గల ఎస్సారెస్పీ కాల్వలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్ల లేక పంటలు, నారుమడులు, చెరువులు ఎండిపోతున్నాయని తెలిపారు. కాల్వ నీళ్లపై ఆధారపడిన రైతులు మిర్చి, వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, జొన్న, పెసర పంటలు వేశారన్నారు. నీళ్ల లేక అవి ఎండిపోతున్నాయన్నారు. ప్రభుత్వం రైతుల అవసరాలను గుర్తించి ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో రైతులు బానోత్ పెద్ద లింగ్యా, సుమన్, భీముడు, బాబు, వీరన్న, తావుర్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

కేసముద్రం: స్కూల్‌కి వెళ్లలేదని తండ్రి మందలిస్తాడేమోనన్న భయంతో పురుగుల మందు తాగిన ఓ విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని బోడమంచ్యాతండా జీపీ శివారు గుడితండాలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ధరంసోత్ రాము, వనిత దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు విష్ణు(16) మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈక్రమంలో ఈనెల 3న స్కూల్‌కి వెళ్లకుండా విష్ణు ఇంటివద్ద ఉన్నాడు. అప్పటికే ఊరికి వెళ్లిన తండ్రి తిరిగి ఇంటికి వచ్చాక, తనను మందలిస్తాడేమోనన్న భయంతో అతడు ఇంట్లో ఉన్న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కొడుకు జ్ఞాపకాలను తలచుకుంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు అందర్ని కలచివేసింది. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రైల్వే ఉద్యోగికి తీవ్రగాయాలు

బయ్యారం: సరదాగా బయ్యారం పెద్దచెరువు వద్దకు వచ్చిన రైల్వే ఉద్యోగికి అనుమానాస్పదస్థితిలో తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చెరువుకట్ట వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం విలేజి గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన బొందకల్లు రవి స్టేషన్ గుండ్రాతిమడుగు సమీపంలోని పోలంపల్లితండా రైల్వేగేటు వద్ద గేటుమన్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో తన స్నేహితులతో చెరువు వద్దకు వచ్చిన రవి చేతికి తీవ్రగాయాలు కాగా తోటిస్నేహితులు గుట్టు చప్పుడు కాకుండా మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి సైతం వరంగల్‌కు చికిత్స నిమిత్తం తీసుకెళ్లడంతో సంఘటన ఎలా జరిగిందో తెలియని స్థితి నెలకొంది. అయితే ప్రమాదస్థలంలో ఉన్న వారు వివరాలు వెల్లడిస్తేనే అసలు విషయం తెలిసే అవకాశం ఉంది.

సొంత పనులకు జీపీ ట్రాక్టర్

పెద్దవంగర: గ్రామీణ పల్లెలు పరిశుభ్రంగా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. మండలంలోని అవుతాపురం గ్రామంలో వాటర్‌మన్ గ్రామ పంచాయతీ అవసరాలకు ఉపయోగించుకోవాల్సిన ట్రాక్టర్‌ను ఆదివారం ఓ రైతు ఎరువుల బస్తాలను పొలం వద్ద వేసి వ్యవసాయ పనులకు ఉపయోగిస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. కూలీలను సైతం వ్యవసాయ బావుల వద్దకు తీసుకెళ్లి వదిలేసి వస్తున్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇదే విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా జీపీ ట్రాక్టర్‌లో ఎరువుల బస్తాలు తీసుకెళ్లింది మా దృష్టికి వచ్చింది. విచారణ చేపట్టి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు.

గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

నెహ్రూసెంటర్: ప్రమాదాల బారిన పడుతున్న గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న డిమాండ్ చేశారు. ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి గాయాలపాలై జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న గీత కార్మికుడు శ్రీనివాస్‌గౌడ్‌ను కేజీకేఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న మాట్లాడుతూ.. గౌడవృతి చేసుకుంటూ ప్రమాదం బారినపడి గీతకార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందిన గీత కార్మికులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలన్నారు. పరామర్శించిన వారిలో కేజీకేఎస్ నాయకులు గడ్డం శ్రీను, చిర్రగోని యాకమూర్తి, నలమాస రాజు తదితరులు ఉన్నారు.

జవాన్‌కు నివాళి

గార్ల: అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో ట్రక్కు బోల్తాపడిన ఘటనలో మృతిచెందిన ఐటీబీపీ జవాన్ భూక్యా రమేష్ భౌతికాయంను వైఎస్సార్ టీపీ మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ బానోత్ సుజాత మంగీలాల్ ఆదివారం సందర్శించారు. మండలంలోని పీక్లీ తండాలో రమేష్ భౌతికాయంపై పూలమాల వేసి ఆమె నివాళులర్పించారు. ఆమె వెంట పార్టీ మండల కన్వీనర్ మాళోత్ భాను, పాపానాయక్, బాబూరావు పాల్గొన్నారు.

వర్ధంతి

మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, రెడ్యాల సర్పంచ్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఆర్ఐ వెన్నం విజయకాంత్ రెడ్డి మాతృమూర్తి సరోజమ్మకు బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఆదివారం నివాళులర్పించారు. సరోజమ్మ వర్ధంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నూకల నరేష్ రెడ్డి, కేఎస్ఎన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ భూక్య మురళీ నాయక్, ఘనపురపు అంజయ్య, బీఆర్ఎస్ అర్బన్ యూత్ అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, డాక్టర్ రంజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెల్లికుదురు: 1976-77 బ్యాచ్ విద్యార్థులు

నెల్లికుదురు: 1976–77 సంవత్సరంలో కలిసి చదువుకున్న విద్యార్థులు 46 తర్వాత మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావుతోపాటు గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తొర్రూరు: 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

తొర్రూరు: తొర్రూరు డివిజన్ కేంద్రంలోని తిర్మల ఫంక్షన్‌హాల్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒకరికొక్కరు ఆప్యాయంగా పలుకరించుకొంటూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమ గురువులైన రామిరెడ్డి, సోమిరెడ్డి, సంజజీవ్‌రెడ్డి, లచ్చిరెడ్డి, సోమయ్య, రాజబాబు, ప్రస్తుత హైస్కూల్ హెచ్ఎం బీవీరావులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సలామ్, రమేష్, మల్లేష్, రచ్చ శ్రీను, సలాం పాషా, గుగులోత్ తదిరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారంలో కమిటీ సభ్యులు

మహబూబాబాద్ రూరల్: వాసవీ క్లబ్ కపుల్స్ బాధ్యులు సేవే పరమావధిగా, సేవే లక్ష్యంగా ముందుకెళ్లాలని క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మాలే యోగేశ్వరరావు పిలుపునిచ్చారు. 2023వ సంవత్సరానికి గాను నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జిల్లా కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. వాసవి క్లబ్ కపుల్స్ ప్రస్తుత అధ్యక్షుడు మాలె శ్రవణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మాలే యోగేశ్వర రావు, విశిష్ట అతిథిగా డిస్టిక్ గవర్నర్ రవ్వ గీత హాజరై, క్లబ్ కపుల్స్ ప్రెసిడెంట్ ఈగ శ్రీనివాస్ రమ్య, ప్రధాన కార్యదర్శి జంగాల సదా శివుడు జ్యోతి, కోశాధికారి నవీన్ లక్ష్మీప్రసన్న దంపతులతో వాసవి మాత సాక్షిగా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, నళిన్, లక్ష్మీ నారాయణ, కృష్ణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కురవి: రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు కురవి మండలం నేరడ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని బి.శ్రావణి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె.సాయిలు ఆదివారం తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనడానికి వెళ్తున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థిని శ్రావణితోపాటు గైడ్ టీచర్ రాధారపు సునీతలను అభినందించారు. గత ఏడాది డిసెంబర్ 25, 26 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఎకోఫ్రెండ్లీహోమ్ అనే ఎగ్జిబిట్‌తో ఉత్తమ ప్రతిభ కనపరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న రాంచంద్రునాయక్

చిన్నగూడూరు: గ్రానైట్ లారీ ఢీకొని మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటామని డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రాంచంద్రు నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని మంగోరిగూడెంలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు మాలోతు నెహ్రూ నాయక్ బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించి మృతి చెందిన (సుమన్, శ్రీకాంత్, నవీన్) కుటుంబాలకు రూ.15వేలు, గాయపడిన కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని అన్నారు.

13, 14 తేదీల్లో యూటీఎఫ్ మహాసభలు



తొర్రూరు: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఐదో మహా సభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీ కృష్ణ కోరారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సంఘం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 13, 14 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో చేపట్టనున్న రాష్ట్ర మహాసభను ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నాగమల్లయ్య, భిక్షపతి, వెంకన్న, నాయకులు రమేష్, యాకుబ్, వంశీ, పార్వతి, అజయ్, లింగరాజు, వరకుమార్, రాయలు, తదితరులు పాల్గొన్నారు.